బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న రజక సంఘం నాయకులు

రొద్దం: మండల పరిధిలోని చిన్నకోడిపల్లి గ్రామానికి చెందిన రజక పరమేష్ కుమారుడు ఈనెల 12 రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం విధితమే. దీంతో సోమవారం రజక సంఘం ఆధ్వర్యంలో రూ 41,500 వేలను బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఘనంగా 'హర్ ఘర్ తిరంగ '

గోరంట్ల: మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో అధికారులు విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని ఇళ్లకు జాతీయ జెండాలను అధికారులు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి స్థలం చూపండి

అమరాపురం: మండలంలోని హేమావతిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని భక్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న సర్వే నెంబర్ 704 1ఏ, 1బీలో స్థలం ఉందని తమకు ఆ స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గుజ్జారప్ప, రత్నమ్మ, నవీన్, భవానికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుతప్పితే ప్రమాదమే



ద్విచక్ర వాహనాలు వెళ్లే ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన మట్టి

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై కియా పరిశ్రమ ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశం నుంచి జాతీయ రహదారిపైకి అధిక టన్నేజీ వాహనాలు వెళ్తుంటాయి. దీంతో రోడ్డు మీదకు దుమ్ము, మట్టి చేరి బైక్‌లు వెళ్లే ఫుట్‌ఫాత్‌ను ఆక్రమించడంతో ద్విచక్ర వాహనాదారులకు ఇబ్బందిగా మారింది. జాతీయ రహదారిపై గంటకు 100 కిలో మీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పొరపాటున వాహనాలు పట్టు తప్పితే ఇక ప్రమాదం ఖాయమని వాహనదారులు చెబుతున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనాన్ని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉందా?, నాణ్యతను పాటిస్తున్నారా, మెను ప్రకారం భోజనం చేస్తున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కంచిసముద్రం పంచాయతీ పరిధిలో బయన్నపల్లి వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను కూడా వారు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు హాజరుకండి

రొళ్ల: మండల కేంద్రంలో మంగళవారం జరుపుకోనున్న 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ తెలిపారు. ఉదయం 8 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద కూడా జాతీయ జెండాను ఎగురు వేయాలని కోరారు.

బూట్లు పంపిణీ

పావగడ: స్థానిక క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనే స్కౌట్స్, గైడ్స్ బృందాలకు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్ బూట్లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బసవలింగప్ప, రఘువీరప్ప, సంధ్య కిరణ్ పాల్గొన్నారు.

విద్యుత్ సక్రమంగా సరఫరా చేయండి

చిలమత్తూరు: అప్రకటిత విద్యుత్ కోతలకు నిరసనగా సోమవారం మండలంలోని దేమకేతేపల్లి రైతులు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ తిరుమలేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిర్మించండి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కొత్తపల్లి క్రాస్ వరకు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములు, బాలస్వామి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఓం శక్తి ఆలయంలో చోరీ

హిందూపురం అర్బన్: కిరికెర దగ్గరున్న ఓం శక్తి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ తలుపులు పగులగొట్టి ఓం శక్తి అమ్మవారి మెడలో ఉన్న తాళిబొట్టును దుండగులు ఎత్తుకెళ్లారు. రూ.30 వేలు విలువ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు సడియప్పన్ తెలిపారు. అలాగే హుండీ కూడా పగుల గొట్టి అందులో మొత్తాన్ని ఎత్తుకెళ్లారన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

హిందూపురం అర్బన్: మలుగూరు ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. మూర్తి, జశ్వంత్, చంద్ర, నారాయణకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. ఘర్షణకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఈ - పంట నమోదు పరిశీలన

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని అప్పలకుంట , కిరికెర 3 , రైతు భరోసా కేంద్రం పరిధిలోని పొలాల్లో ఈ - పంట నమోదును సోమవారం హిందూపురం సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ పరిశీలించారు. పంటలు వేసిన ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు.

మంత్రికి వినతి పత్రం

మడకశిర: రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో వివిధ స్థాయిల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అనంతపురం వచ్చిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతి పత్రాన్ని అందించినట్లు రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి స్పందించి సమస్యలను పరిష్కరించడానికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించడానికి మంత్రి సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. ఆయన సోమవారం ఆర్అండ్‌బీ బంగ్లాలో నియోజకవర్గంలోని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని మండలాల ఎంపీడీఓలు, పీఆర్ అధికారులు, పీఆర్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు. మండలాల వారీగా ఈ సమావేశంలో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు తదితర భవన నిర్మాణాలపై సమీక్షించారు. అలాగే గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ భవనాల పనులు నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే పనులు వేగవంతం కావాలని కోరారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులను వేగవంతం చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. పీఆర్ ఏఈలు లేని మండలాలకు చురుగ్గా పనిచేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్లనే ఇన్‌చార్జ్‌గా నియమించి పనులు చేయించాలన్నారు. పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించబోమన్నారు. అన్ని భవనాల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. పనుల్లో పూర్తిస్థాయిలో నాణ్యత ఉండాలని కోరారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిమెంట్ దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు. నాడు–నేడు పనులపై కూడా పూర్తిస్థాయిలో శ్రద్ధ పెట్టాలని కోరారు. పీఆర్ అధికారులు,ఎంపీడీఓలు కూడా భవనాల పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో పీఆర్ డీఈ పద్మావతి, ఎంపీడీఓలు రామారావు, మునిస్వామి, నరేంద్రకుమార్, ఆజాద్, మడకశిర ఏఓ ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బైక్‌లో మంటలు

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని సడ్లపల్లికి చెందిన బాలాజీరెడ్డి అనే వ్యక్తి తన ఇంట్లో ఎలక్ట్రిక్ బైక్‌కు సోమవారం చార్జింగ్ పెడుతుండగా బైక్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇంట్లో వస్తువులు కూడా కాలిపోయాయి. చార్జింగ్ పెట్టిన కాసేపటికే ఒక్కసారిగా బండి నుంచి మంటలు వచ్చాయని, ప్లగ్ తొలగించే క్రమంలో బాలాజీరెడ్డి చేతికి తీవ్ర గాయమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాసిరకం చార్జర్లు వాహనాల్లో బిగించడంతోనే ప్రమాదాలకు కారణమని వాహన నిపుణులు చెబుతున్నారు.

























ఘనంగా 'నా భూమి - నాదేశం'


మడకశిర: గౌడనహళ్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన దృశ్యం


పెనుకొండ: జెండా ఎగుర వేస్తున్న దృశ్యం


గుడిబండ: మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సోమవారం నా భూమి - నాదేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పెనుకొండ పట్టణంలో నగర పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నాభూమి - నాదేశం కార్యక్రమం ఘనంగా జరిగింది. కమిషనర్ వంశీకృష్ణ నగర పంచాయితీ కార్యాలయం వద్ద మువ్వన్నెల జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. కార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధుడు కల్లూరు సుబ్బారావు మనవళ్లు పంచాంగం శేషశయనం వారి కుటుంబ సభ్యులు తహసీల్దార్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: చెట్ల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సర్పంచ్ కరుణాకర్‌గౌడు, ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు.

పరిగి: దేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటాలని వక్తలు పేర్కొన్నారు. నా భూమి –నాదేశం కార్యక్రమాలను సోమవారం మండలంలోని శ్రీరంగరాజుపల్లి, ఊటుకూరు, శాసనకోట గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి, ఏపీఓ చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

అమరాపురం: గ్రామాల్లో విరివిగా మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీడీఓ మునిస్వామి, ఏపీఓ గోపాల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కె.శివరం , గ్రామాల్లో నాభూమి - నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు.

మడకశిరరూరల్: అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం గౌడనహళ్లి, వైబీహళ్లి, అమిదాలగొంది, కదిరేపల్లి పంచాయతీల్లో నా మట్టి– నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులతో కలిసి ప్రజా ప్రతినిధులు శిలాఫలకాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమర యోధుల సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల పరిధిలోని మందలపల్లి, రెడ్డిచెరువుపల్లి గ్రామ పంచాయతీల్లో అధికారులు, స్థానిక సర్పంచుల ఆధ్వర్యంలో నాభూమి- నాదేశం కార్యాక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు ప్రమీల , రమాదేవి, వినోద్, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్తా, ఎంపీటీసీలు లక్ష్మినారాయణరెడ్డి, నాగేనాయక్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్ : మండలంలోని తూమకుంట ప్రాథమికోన్నత పాఠశాల వద్ద నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ రత్నమ్మ దేశ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి, మల్లినమడుగు, ఎం.రాయాపురం పంచాయతీ కేంద్రాల్లో సోమవారం 'ఆజాద్ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా 'నా భూమి–నా దేశం' కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో చేపట్టారు. తొలుత ఆయా పంచాయతీ కేంద్రంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఎగురు వేసి శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నమ్మ, సర్పంచులు సదాశివప్ప, శారదమ్మ, నరసింహప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు యంజారప్ప, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, మహంతేష్, గుండప్ప, తిమ్మారెడ్డి, శ్రీనివాస్, ఏపీఓ ఓబుళప్ప, ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని వినతి

పెనుకొండ: పెనుకొండలో ఉన్న కొండపైకి విద్యుత్ లైన్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని పర్యాటక పోరాట కమిటీ అధ్యక్షులు ప్రతాపరెడ్డి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరారు. సోమవారం అనంతపురంలో మంత్రిని కలసిన ప్రతాపరెడ్డి కొండపైకి విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని వివరించారు. అలాగే రంగరాయల చెరువు కట్ట మీదుగా కొండపైకి వెళ్లే రహదారికి అనుసంధానంగా రోడ్డు నిర్మించాలన్నారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారని చెప్పారు.

బోరుకు మరమ్మతు చేయండి

మడకశిర: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం మండలంలోని టీడీపల్లి తండా మహిళలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. బోరు మరమ్మతు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులకు చెప్పి నాలుగు నెలలైనా బోరు మరమ్మతు చేయలేదన్నారు. వెంటనే బోరుకు మరమత్తు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలని అర్జీ

మడకశిర: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో టీడీపీ హయాంలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు, స్థానిక నాయకులు రఘునాథ్, లక్ష్మీనారాయణ తదితరులు వినతిపత్రం అందించారు. అలాగే డ్రైనేజీలు కూడా సక్రమంగా లేకపోవడంతో మురికి నీరు రోడ్లపైకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

మా భూములు మాకివ్వండి

లేపాక్షి: తాము సాగు చేసుకుంటున్న తమ భూములను తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొర్లకుంట గ్రామానికి చెందిన రైతులు తహసిల్దార్‌కు విన్నవించారు. సోమవారం ఉదయం లేపాక్షి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పీఓటీ యాక్ట్‌లోనే ఉన్న భూములను చట్టపరంగా సాగు చేసుకుంటున్న వారికి ఇవ్వాలన్నారు.

ఇంటి పట్టాల మంజూరుకై నిరసన

లేపాక్షి: ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ బాబు స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే తహసీల్దార్ సబ్ కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. భూములకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించడంతో వారు నిరసన విరమించారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

పెనుకొండ: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు ముస్తాబయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలో హడావుడి కనిపించింది. అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జెండా ఎగుర వేయడానికి ఏర్పాట్లు చేశారు. పలు దుకాణాల వద్ద, పోస్టాఫీస్ దగ్గర విద్యార్థులు, యవతీ, యువకులు జాతీయ జెండాలు కొనుగోలు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు నల్లనాగప్ప (80) చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నెకొత్తపల్లికి చెందిన నల్లనాగప్ప ఆదివారం ఉదయం తన మిత్రుడు హనుమంతప్పతో కలసి పెనుకొండ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో 44వ జాతీయ రహదారిపై గుట్టూరు గ్రామం శివారులోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో నాగప్ప తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కియా పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యర్థాలతో ఇబ్బందులు


గుట్టలుగా పడిన వ్యర్థ పదార్థాలు

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం గ్రామంలో జగనన్న లే అవుట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కొందరు హోటల్ నిర్వాహకులు యథేచ్ఛగా వ్యర్థ పదార్థాలను వేస్తున్నారు. దీంతో వ్యర్థ పదార్థాలు గుట్టగా పెరిగి దుర్వాసన వెదజల్లుతోంది. అటుగా వెళ్లే వారితో పాటు స్థానికులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'సాక్షి' పంచాయతీ సెక్రటరీ జమీర్‌ను వివరణ కోరగా ఎలాంటి డంపింగ్ యార్డుకు ఇక్కడ అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు.









క్లుప్తంగా

వివాహానికి విచ్చేయండి



మధుమతిరెడ్డికి వివాహ పత్రికను అందజేస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

హిందూపురం: తన సోదరుడి కుమార్తె వివాహ వేడుకకు విచ్చేయాలని హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డికి ఎంపీ గోరంట్ల మాధవ్ ఆహ్వాన పత్రిక అందించారు. చౌళూరు గ్రామంలో మధుమతిరెడ్డి స్వగృహానికి ఎంపీ వెళ్లారు. ఆగస్టు 21న జరిగే వివాహ వేడుకకు హాజరుకావాలని కోరారు.

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై సమావేశం



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

హిందూపురం టౌన్: ఇంటింటి ఓటరు సర్వేలో భాగంగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఓటర్ల చేరిక, మరణించిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగింపులపై మున్సిపల్ కమిషనర్ వారితో చర్చించారు. హౌస్ టూ హౌస్ సర్వేలో భాగంగా ఓటరు జాబితాలో తప్పులు, ఒప్పులు బీఎల్‌ఓలు గుర్తిస్తున్నారన్నారు. దీనిపై సమగ్రంగా సర్వే జరిపి తప్పుల్లేని జాబితాను రూపొందిస్తామని అన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'పురం'లో కాగడాలు, జెండాలతో ర్యాలీ



కాగడాలు, జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: దేశ విభజన భయానక స్మారక దినాన్ని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. సోమవారం రాత్రి స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి కాగడాలు, జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, బీజేపీ ప్రజాపోరు కన్వీనర్ చలపతి, కౌన్సిలర్ అంజలిలు మాట్లాడుతూ ఆగస్టు 14న మత ప్రాదిపదికన భారతదేశం విడిపోయిన సమయంలో ఇక్కడి నుంచి అందరూ క్షేమంగా వెళ్లారని, అయితే అక్కడి నుంచి వచ్చే వారు ఎన్నో ఇబ్బందులు, బాధలు పడ్డారన్నారు. వాటిని నేటికీ మర్చిపోలేమన్నారు. ఈ సందర్భంగా జరిగిన పోరాటాలు, త్యాగాల జ్ఞాపకార్థం ఆగస్టు 14ను విభజన భయానక దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాగ్యలక్ష్మి, అమర్ దేవేంద్ర, నగేష్, శివప్ప, అంజన్‌రెడ్డి, అశోక్‌కుమార్, శ్రీరాములు, గోవింద, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

హిందూపురం: చెరువు కట్టలను బలపేతం చేయడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషిచేస్తోందని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. ఏపీ క్లీనింగ్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఫండ్స్ కింద మంజూరైన రూ.54 లక్షల నిధులతో కొట్నూరు కెనాల్‌పై నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి 33వ వార్డు కౌన్సిలర్ శివ ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో దీపిక మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు పెద్ద చెరువులను బలపేతం చేయడంతో పాటు అభివృద్ధి చేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పనులు పూర్తయితే చెరువు కట్టలు బలోపేతం అవ్వడంతో పాటు ప్రజలు చెరువు కట్టపై రాకపోకలు చేయడానికి అనుకూలత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

- పలుచోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఏకగ్రీవం
- గ్రామాల్లో ఎన్నికల సందడి
- 19న ఎన్నికలు, అదే రోజే ఫలితాలు





అగళి: డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న రంగప్ప, చిలమత్తూరు: వార్డు మెంబరుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఈఓఆర్డీ

గోరంట్ల: స్థానిక సంస్థల ఉప ఎన్నికలకు సంబంధించి సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని 18వ వార్డుకు ఉప ఎన్నికలు జరుగుతున్న విషయం విధితమే. 18 వార్డు ఎన్నికలకు సంబంధించి ఆరుగురు నామినేషన్ వేశారు. అయితే సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల ఉప సంహరణ గడువు ముగిసేసరికి మంజూనాథ్, ఆంజనేయులు అనే ఇద్దరు తమ నామినేషన్లను ఉప సంహరించుకున్నట్లు ఎన్నికల అధికారి సుధాకర్ తెలిపారు. 18 వార్డు ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గొల్ల నరసింహప్పతో పాటు మరో ముగ్గురు ఉన్నారన్నారు. ఈనెల 19న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎన్నికలు జరుగుతాయని, అదేరోజు కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని ఎన్నికల అధికారి వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో వార్డు సభ్యునిగా పోటీ చేస్తున్న అభ్యర్థి గొల్ల నరసింహప్పకు ప్రెజర్ కుక్కర్ గుర్తును అధికారులు కేటాయించారు.

ఆ ఇద్దరి మధ్యే పోటీ

హిందూపురం అర్బన్: చలివెందుల సర్పంచ్ ఉప ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉప సంహరణ అనంతరం వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉపేంద్రరెడ్డి, టీడీపీ బలపరచిన రవీంద్రారెడ్డి మాత్రమే పోటీలో ఉన్నట్లు ఏఓ క్రిష్టప్ప, ఈఓఆర్‌డీకుళ్లాయప్ప తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. నామినేషన్ల ఉప సంహరణతో చలివెందుల, మీనకుంటపల్లి, రాచపల్లిలలో ఎన్నికల సందడి నెలకొంది.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

హిందూపురం అర్బన్ : చలివెందుల సర్పంచ్ ఉప ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఉపేంద్రరెడ్డికి మంచం గుర్తు కేటాయించారు. అలాగే టీడీపీ బలపరిచిన అభ్యర్థి రవీంద్రారెడ్డికి కత్తెర గుర్తును కేటాయించినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

3వ వార్డు బరిలో ఇద్దరు అభ్యర్థులు

రొద్దం: రొద్దం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డుకు ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన బోయ అంగజాల అశ్వర్థమ్మ, టీడీపీ బలపరచిన బంజిగ ఈశ్వరప్ప బరిలో ఉన్నారు. ఈనెల 19న ఎన్నికలు జరగనున్నట్లు ఎన్నికల అధికారి కేశవరెడ్డి చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. 3వ వార్డులో మొత్తం ఓటర్లు 508 మంది ఉన్నారు. అందులో పురుషులు 266 మంది, స్త్రీలు 242 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

రెబల్ అభ్యర్థి నామినేషన్ ఉప సంహరణ

హిందూపురం అర్బన్: చలివెందుల పంచాయతీ ఉప ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేసిన మహేంద్రనాథ్‌రెడ్డి సోమవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకొన్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల ఆదేశానుసారం నామినేషన్ ఉపసంహరించుకున్నానని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఏకగ్రీవం

అగళి: మండల పరిధిలోని పీ బ్యాడగెర పంచాయతీలోని 2వ వార్డు మెంబర్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు రంగప్ప ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పద్మావతి తెలిపారు. టీడీపీ మద్దతుదారుడు శివలింగప్ప తన నామినేషన్ను సోమవారం విత్ డ్రా చేసుకున్నారు. అగళి మండల పంచాయతీలోని 2వ వార్డుకు మాత్రం ముగ్గురు బరిలో ఉన్నారు.

సోమందేపల్లి: మండలంలోని మూడు వార్డుల ఉప ఎన్నికలకు సంబంధించి రెండు వార్డు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఆర్‌ఓ నాగరాజురావు తెలిపారు. బ్రాహ్మణపల్లి 3వ వార్డులో టీడీపీ అభ్యర్థి మహేష్, మండ్లి 8వ వార్డులో నాగేషప్ప విత్‌డ్రా చేసుకున్నారు. బ్రాహ్మణపల్లిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సుజాత, మండ్లిలో లీలావతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఆర్‌ఓ నాగరాజురావు తెలిపారు.

లేపాక్షి: మండలంలోని కోడిపల్లి వార్డు మెంబర్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు అలివేలమ్మ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఈఓఆర్డీ శివన్న తెలిపారు. అయితే పులమతిలో మాత్రం ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు.

చిలమత్తూరు: మండలంలోని మొరసలపల్లి పంచాయితీలోని 4వ వార్డు మెంబర్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు లక్ష్మీదేవమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సుభాషిణమ్మ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఒక్కరే బరిలో ఉండటంతో లక్ష్మీదేవమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువపత్రాన్ని అందజేశామన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, ఎంపీపీ పురుషోత్తమరెడ్డికి లక్ష్మీదేవమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల రిహార్సల్స్



రిహార్సల్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

పావగడ: స్థానిక క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించే 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్, ఎమ్మెల్యేకు గౌరవ వందనం తెలిపేందుకు గురుభవన్ మైదానంలో సోమవారం విద్యార్థులు రిహార్సల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవైపు పట్టణంలో జాతీయ జెండాల కొనుగోలుకు స్థానిక ప్రజలు ఉత్సాహం చూపారు. జెండా ఆవిష్కరణకు వేదికగా మారిన క్రీడా మైదానం కూడా ముస్తాబైంది. తహసీల్దార్ వరదరాజు, ఆర్‌ఐ రాజగోపాల్ దగ్గరుండి వేదికను సిద్ధం చేశారు.

రెండోరోజూ భక్తుల సందడి



మహమ్మద్ ప్రవక్త వస్తువులను చూసేందుకు వచ్చిన భక్తులు

పెనుకొండ: పట్టణంలోని బాబయ్య దర్గా సమీపంలో ఏర్పాటు చేసిన మహమ్మద్ ప్రవక్త, ఆయన కుటుంబీకులకు చెందిన విలువైన వస్తు ప్రదర్శనను తిలకించడానికి భక్తులు రెండోరోజైన సోమవారం కూడా భారీగా తరలివచ్చారు. కేశాలు, తలపాగా, రుద్రాక్షలు తదితర వస్తువులను చూసి భక్తులు పరవశించిపోయారు.

జగనన్నతోనే పేదలందరికీ న్యాయం

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే పేదలందరికీ న్యాయం జరుగుతోంది. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సోమవారం పట్టణంలోని బేగార్లపల్లి (20వ వార్డు)లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అంతకు మునుపు బేగార్లపల్లి క్రాస్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాకనే పేదలకు సంతృప్తికరంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో ప్రజలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను దాదాపుగా నెరవేర్చారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఒక సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపట్టారని తెలిపారు. మహిళలకు కూడా అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద విద్యార్థులు సీఎం వైఎస్ జగన్ ఇస్తున్న సహాయ సహకారాలతో ఉన్నత చదువుల్లో రాణిస్తున్నారని వివరించారు. జగనన్నకు రాష్ట్ర ప్రజలు తోడుగా ఉండాలని కోరారు. మాయ మాటలు చెప్పి ప్రతి పక్షాలు వచ్చే ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, జేసీఎస్ కన్వీనర్ ఈశ్వర్, స్థానిక కౌన్సిలర్ సిద్ధప్ప, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, మాజీ సర్పంచు ఎస్ఎన్ కృష్ణమూర్తి, ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు రమేష్, అన్సర్, రూరల్ జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, స్థానిక నాయకులు జయరాజ్, గోపి, సుధీర్‌రెడ్డి,మధు, గోవర్ధన్, నగేష్, శీన తదితరులు పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి



రొళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 శ్రీధర్

రొళ్ల: 'జగనన్న గోరు ముద్ద' పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యంగా తయారు చేసిన భోజనాన్నే వడ్డించాలని ఎంఈఓ-2 శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పర్యటించి మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు కూడా క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరై చక్కగా విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దరంగప్పకు ఉత్తమ కవి పురస్కారం

అమరాపురం: మండల పరిధిలోని కె.శివరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఈ.ముద్దరంగప్పకు ఉత్తమ కవి పురస్కారం అందుకున్నారు. మడకశిరలోని అక్షర జూనియర్ కళాశాలలో సత్యసాయి రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు గద్దర్‌కు అక్షర నివాళి అనే అంశంపై పోటీలు నిర్వహించారు. 25 కవులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా ముద్దరంగప్ప ఉత్తమ కవిగా ఎంపికయ్యారు. అవార్డుతో పాటు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

విద్యుత్ కేబుల్ చోరీ



బోరుబావి వద్ద కేబుల్‌ను కత్తిరించిన దృశ్యం

రొళ్ల: రైతులు వ్యవసాయ బోరుబావి వద్ద విద్యుత్ మోటారు అమర్చిన కేబుల్ ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. వివరాల్లోకి వెళితే... రొళ్ల మండలం కల్లురొప్పం గ్రామంలో రైతులు ఈరన్న, రంగనాథ్, కొత్త పాళ్యం తండా గ్రామంలో శివకుమార్‌నాయక్ బోరుబావి వద్ద విద్యుత్ మోటార్లు ఉపయోగిస్తున్నారు. అయితే ముగ్గురు రైతులకు చెందిన 60 మీటర్ల కేబుల్ ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. సోమవారం ఉదయాన్నే బోరుబావి వద్దకు వెళ్లి పరిశీలించగా కేబుల్ వైర్‌ను కత్తిరించినట్లుగా గుర్తించారు. 60 మీటర్లకు గాను సుమారు రూ.9 వేలకు పైగా నష్టం జరిగిందని వాపోయారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేయనున్నట్లు రైతులు తెలిపారు.

టీడీపీ మహిళా నాయకురాళ్ల హంగామా



టీడీపీ మహిళా నాయకురాళ్లను హెచ్చరిస్తున్న సీఐ ఈరన్న

హిందూపురం: పట్టణంలోని ఎంజీఎం గ్రౌండ్ వద్ద స్వయం సహాయ సంఘాల మహిళా గ్రూపులకు ప్రభుత్వం విడుదల చేసిన నాల్గవ విడుత చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. అయితే మైదానం గేటు దగ్గర టీడీపీ మహిళా నాయకురాళ్లు పార్టీ కండువాలు వేసుకుని టీడీపీ కరపత్రాలు చేత పట్టుకుని బహిరంగ సభకు వెళ్తూ, బయటకు వస్తున్న వారికి కరపత్రాలు అందిస్తూ ప్రచారం చేపట్టారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కౌన్సిలర్లు ఆసీఫ్‌వుల్లా, మారుతీరెడ్డి, చంద్రశేఖర్, మల్లికార్జున తదితరులు నేరుగా బయటకు వచ్చి ఇదేమి పద్ధతంటూ వారించారు. ప్రభుత్వ కార్యక్రమం జరుగుతున్న చోట తెలుగు మహిళలంటూ కండువాలు, పార్టీ కరపత్రాలతో హంగమా చేయడం సరికాదన్నారు. కావాలనే గొడవ సృష్టించి కుచిత రాజకీయ చేసే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. ఇంతలో పోలీసులు వచ్చి టీడీపీ మహిళా నాయకురాళ్లను హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమం జరిగే చోట పార్టీ కండువలు, జెండాలతో వచ్చి గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవని వెంటనే వెళ్లిపోవాలని సీఐ ఈరన్న చెప్పారు. దీంతో టీడీపీ మహిళా నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రాష్ట్రస్థాయి భరత నాట్యంలో ప్రతిభ



నిర్వాహకుల నుంచి సర్టిఫికెట్లు, మెమొంటోలను అందుకున్న విద్యార్థులు

లేపాక్షి: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జరిగిన పింగళి వెంకయ్య విశిష్ట పురస్కార మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా లేపాక్షికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి భరత నాట్యంలో మొదటి స్థానం సాధించారు. లేపాక్షికి చెందిన దేవి నాట్య నిధి మాస్టర్ మంజునాథ్ ఆధ్వర్యంలో వారు నాట్య ప్రదర్శన ఇచ్చారు. నాట్య ప్రదర్శనలో ప్రతిభ చాటిన వారిని అభినందిస్తు విశ్రాంత న్యాయమూర్తి మధుసుధన్ ప్రశంసా పత్రాలతో పాటు మెమోంటోలను అందజేశారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని విబూతిపల్లి గ్రామంలో సోమవారం ఉదయం సీసీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మంజునాథ్, మండల కన్వీనర్ నారాయణస్వామి భూమి పూజ చేశారు. గతంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాపన్న, మంజునాథ్, రామాంజినప్ప, వసంత్, చంద్రప్ప, రవి, అశ్వత్థప్ప, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న ధ్యేయం





మహిళా సంఘాలకు మెగా చెక్కు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, సమావేశానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు

- మెగా చెక్కు పంపిణీలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: 'మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యం. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికే వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నారు' అని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. హిందూపురం ఎంజీఎం గ్రౌండ్‌లో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపాల్టీ పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలకు మంజూరైన సున్నా వడ్డీ మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. బహిరంగ సభలో దీపిక మాట్లాడుతూ ఎన్ని అవరోధలున్నా 2019లో ప్రారంభించిన్న సున్న వడ్డీ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా అందిస్తున్నారని చెప్పారు. 2022–23 సంవత్సరంలో నాల్గవ విడతలో 2237 మహిళా సంఘాలకు రూ.3.86 కోట్లు, 95 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలకు రూ.10.82 కోట్లు మంజురైందన్నారు. నాలుగేళ్లలో హిందూపురం మున్సిపాలీకి సున్నా వడ్డీ కింద రూ.12.14 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. జగనన్న మహిళల అభ్యున్నతికి అన్ని విధాలా కృషి చేస్తున్నారని చెప్పారు. గత టీడీపీ పాలనలో మహిళా సంఘాలు వడ్డీల భారంతో అసలు, వడ్డీ రెండు చెల్లించుకోక బకాయిలు పడి సంఘాలు డీఫాల్ట్‌గా నిలిచి కుదేలు అయ్యాయన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. మహిళలు ఎప్పటికప్పుడు రుణాలు చెల్లిస్తూ కొత్త రుణాలు పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధిస్తుండటం గర్వకారణమన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళ చల్లని దీవెనలు అందించి జగనన్నను మరోసారి ఆశీర్వించాలని, హిందూపురంలోనూ వైఎస్సార్‌సీపీ గెలిపించి మహిళా శక్తిని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బలరామిరెడ్డి , మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, షాజియా, మారుతి రెడ్డి, నాగేంద్రబాబు, రామచంద్ర, గిరి, మల్లికార్జున, రోషన్‌అలీ, పార్వతీ, మణీ, లక్ష్మి, సునీత, చిన్నమ్మ, నాగేంద్రమ్మ, కోఆప్షన్ సభ్యులు సువర్ణమ్మ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.